## దీపావళి సిసింద్రీలు మినీ మినీ కథలు

**నూకరాజు సైకిలెక్కి నెమ్మదిగా త్రొక్కుతున్నాడు!**

**ఆ సైకిలుకూడా నూకరాజులానే నీరసంగా నడుస్తోంది రోడ్డుమీద!**

# "బలే భాన్స్"



"నూకరాజూ, అతని సైకిలూ అంత నీరసంగా ఉండడానికి గల కారణ మేమిటా!!" అని విచారిస్తే తేలిన విషయ మేమిటంటే– "ప్రొద్దున్నే జేబులు ఖాళీగా వుండటమే" అని తేలింది!

నూకరాజుకి యింటిదగర ప్రొద్దుననగా కాఫీ తప్ప—బజార్లో మరింకేం దొరక లేదు! బజార్లో కొట్లు లేకా కాదూ!—హోటళ్ళు లేకా కాదు! లేనిదల్లా "నూకరాజు జేబులో పైసలే!

ఇలా పరివరి విధా లాలోచిస్తూవస్తూన్న నూకరాజు సైకిలు అప్రయత్నంగా ఓచిన్న సందులోంచి పరిగెట్టసాగింది!

"తిట్టే నోరుకీ తిరిగే సైకిలికీ ఖాళీ ఉండదంటే యిదే కామోసు!" అని, అల వాటైన ఆ వీధిన నెమ్మదిగా నవ్వుకుంటూ సైకిలుపై వెళ్తున్నాడు నూకరాజు!

కొంతదూరంలో-

ఓ క్రొత్త స్కూటరుకనిపించింది! దానికి కొంతదూరంలో ఓ ఇద్దరు వ్యక్తులు ఓముస లతనికి 'సోడా' పడుతున్నారు. ముసలతను భోరున ఏడుస్తున్నాడు! ఏడుస్తూనే, తన కాలివైపు చూసుకుంటూ మళ్ళీ ఏడుస్తు న్నాడు! ఆ ఇద్దరు వ్యక్తులు అతడ్ని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నారు! కానీ లాభం లేకపోతూంది.

"నూకరాజు సైకిలు, "పోదామా గురూ!?"...అటూ–"అని అంటున్నట్లని పించి, కాస్త గదమాయిస్తే ఎంతో కొంత దొరక్కపోదనిపించి, మరింత స్పీడుగా త్రొక్కుకుంటూ వెళ్ళి, సైకిలు దిగి; ఆ ముసలతని వైపు నడిచి, విషయం విచారించాడు!

ఆ స్కూటర్ వ్యక్తుల్లో ఒకతను చెప్పడం ప్రారంభించాడు!

సార్! మేమిద్దరం ఈ స్కూటర్ మీద వస్తుంటే, ఈ ముసలతను ఈ వీధిలో అడ్డదిడ్డంగా వస్తూ, మమ్మల్ని కన్ఫ్యూజ్ చేసేశాడండీ! చిన్నగా మాత్రం దెబ్బ తగిలింది! వెంటనే స్పృహకోల్పోయాడు. ఇప్పుడే సోడా పడితే కాస్త తెలివి వచ్చింది సార్! ఇదండీ సంగతి అన్న ఆ వ్యక్తివంకా, ఓ సారి స్కూటర్ వంకా చూశాడు.

స్కూటర్‌కి 'యల్' బోర్డు తగిలించి ఉంది! పరిస్థితి అర్థమైపోయిన నూకరాజు-

"గబగబా క్లిప్‌నుంచి ఫైలు తీసి – జేబులోంచి పెన్ను తీసి, మీ అడ్రస్ చెప్పండి. స్టేషన్‌కు స్కూటర్ని నడ పండి!" అని గదమాయించాడు.

**-వరిగొండ రామకృష్ణ**

"ఎవరి దృష్టినుండైనా సునాయాసంగా తప్పించుకోవచ్చును కానీ- పోలీసుల దృష్టిలో పడితే మాత్రం...." అని "ఎక్కడో- ఎప్పుడో- ఎవరో"- చెప్ప కోగా విన్న విషయం గుర్తుకొచ్చి, ఆ ఇద్దరు వ్యక్తుల్లో రెండవ అతను నెమ్మ దిగా నూకరాజుని "కాకా" పట్టడం మొద లెట్టాడు!

అడిగిన వెంటనే ఒప్పేసుకుంటే లోకువైపోయినట్టు ఉంటుందని తలచి నూకరాజు ఓ పావుగంట "అదికాదు ఇది కాదు!" అని రూల్స్ మాట్లాడాక చివరికి ఓ వదికి బేరం కుదుర్చుకోవడం- ఆ ముస లాడికో పదిచ్చుకుని హాస్పిటల్‌కి తీసు కెళ్ళి ప్రథమచికిత్స ఆస్కూటరు వ్యక్తులు చేయించడానికీ "కాంట్రాక్టు" కుదుర్చు కున్నాడు!

రాసిన కాగితాన్ని వాళ్ళెదురుగ్గానే చింపేశాడు!

ఆ స్కూటరు వ్యక్తులు బాగా అలసి ఉండడంతో - కాస్త కాఫీ త్రాగొచ్చి, వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్తామంటే- "సరే!" అన్నాడు నూకరాజు.

వాళ్ళిద్దరూ హోటలువైపు వెళ్ళారు!

ముసలతనికి మంచిమంచి కాఫీ ఓదార్పు లిచ్చి, అతడి దగ్గరున్న ఆ పదీ జాతీయం చేస్తుంటే - వాళ్ళిద్దరూ రానే వచ్చారు! వాళ్ళ వెంటే రిక్షాకూడా వచ్చింది!

ఆ యిద్దరూ ముసలతన్ని రిక్షాలో ఎక్కించారు!

నూకరాజు సైకిలెక్కి, "ఇదిగో చూడండి! ఈ ముసలాడికి జాగ్రత్తగా ట్రీట్‌మెంట్ చేయించండి! నడపరా రిక్షాని! పదండి స్కూటరెక్కి!! నేనూ మీవెంటే వస్తున్నాను!!!—" అని అన్న మాటలకి స్కూటరు....రిక్షా కదిలాయి కానీ—నూకరాజు సైకిలు మాత్రం మరోదారి పట్టేసింది.

నూకరాజు జేబులిపుడు బరువుగా ఉండడంతో—నూకరాజు సైకిలు ఆ నల్లని తార్రోడ్డుమీద మాంచి హుషారుగా ముందుకు పోతోంది!!

